# లండన్ మామయ్య

– డా॥ కె. పద్మలత

ఆ రోజు ఆదివారం కావడంతో ఏడు గంటలకు లేచి బ్రష్ చేసుకుని, వేడి కాఫీ తాగి పేపర్ చదువుతూ వరండాలో కూర్చున్నాను. ఇంతలో హాల్లో ఫోన్ మోగుతున్న చప్పుడు... "బద్ధకంగా ఉంది. ఫోన్ సరోజ చూస్తుందిలే" అనుకుని అలాగే కూర్చున్నాను.

"ఫోన్ లిఫ్ట్ చేయడానికి కూడా ఎవరికీ ఓపిక లేదా? వంటింట్లో నుండి వచ్చి నేనే తీయాలా. ఆదివారం కూడా నాకు ఉరుకులు, పరుగులు తప్పవు కదా" సరోజ విసుర్లు విని ఇక తప్పదనుకుని హాల్లోకి వెళ్లాను. అప్పటికే సరోజ ఫోన్ లిఫ్ట్ చేసి మాట్లాడుతోంది.

"హలో! ఎవరండీ? ఆc... మామయ్యా! మీరా... బావున్నారా! సడెన్ సర్‌ప్రైజ్. మీరు ఫోన్ చేస్తారని ఊహించలేదు. అత్తయ్య బాగుందా..." అంటూ సరోజ సంభ్రమాశ్చర్యాలతో మాట్లాడుతుంటే, "ఎవరీ మామయ్య?" అనుకున్నాను. అవతలి వ్యక్తి ఏమన్నాడో తెలీదు గానీ, సరోజే మళ్లీ 'వైజాగ్ వస్తున్నారా? ఎప్పుడూ? మా ఇంటికి తప్పకుండా రండి! అలాగే, నాకేం ప్రాబ్లమ్ లేదు. అత్తయ్యనడిగినట్టు చెప్పండి' అని ఫోన్ పెట్టేసింది.

"ఎవరీ మామయ్య? ఎప్పుడొస్తున్నాడు?" కుతూహలంగా అడిగాను.

"మా లండన్ మామయ్యలెండి. ఎల్లుండే వస్తున్నాడు" చాటంత మొహం చేసుకొని అని "బాబోయ్... ఈ రోజంతా పనే. ఇల్లు శుభ్రం చేసుకోవాలి. కర్టెన్లు ఉతకాలి. అబ్బో... చాలా పనుంది" అంటూ హడావుడిగా బయటకు వెళ్లింది.

నేను నిమిత్తమాత్రునిలా చూస్తుండిపోయాను. సదరు లండన్ మామయ్య మా అత్తగారికి కజిన్ బ్రదర్. ఏవో ఫంక్షన్స్‌లో రెండు, మూడుసార్లు ఆయనను చూశాను. ఆయన ముప్ఫయ్యేళ్ల క్రితం ఇండియాలో ఇంజనీర్ ఉద్యోగాన్ని వదులుకొని లండన్ వెళ్లాడట. ఆ తర్వాత ఫ్యామిలీని కూడా తీసుకెళ్లాడు. అయిదు సంవత్సరాల క్రితం మళ్లీ తిరిగొచ్చేశారు. హైదరాబాద్‌లో చిక్కడపల్లిలో బ్రహ్మాండమైన ఇల్లు కట్టుకున్నాడట. జూబ్లీహిల్స్‌లో కూడా కొడుకు కోసం ప్యాలెస్ లాంటి ఇల్లు కట్టాడట. ప్రస్తుతానికి ఏదో బిజినెస్ చేస్తున్నాడంటారు. అదేదో నాకు తెలీదు.

"రాములమ్మని మధ్యాహ్నం రమ్మన్నాను. ఇల్లంతా శుభ్రం చేయించాలి. బాగా డబ్బున్నవాళ్లు. వాళ్లకి మనిల్లు నచ్చుతుందో, లేదో?" సరోజ ఆందోళన చూసి, "ఆయనేమన్నా మనింట్లో పర్మినెంట్‌గా ఉండడానికి వస్తున్నాడా నచ్చడానికి? ఏదో ఓ పూట ఉండి వెళ్లిపోతాడు. దానికంత కంగారేంటి?" చికాగ్గా అన్నాను.

సరోజ కోపంగా చూసి, "మీరెప్పుడూ ఇంతే. ఏదీ పట్టించుకోరు. వాళ్ల ముందు మనం మరీ బీదవాళ్లలా కనిపిస్తే ఏం బావుంటుంది. అన్నీ కాస్త నీట్‌గా అరేంజ్ చేయాలి కదా" అంది.

"ఆరు లక్షలు బ్యాంక్ లోన్ తీసుకుని కట్టిన ఇల్లు. బంగారంలా వుంది. మనమెందుకు బీదవాళ్లలా కనిపిస్తాం" అన్నాను.

"అబ్బో... ఇంతోటి ఇల్లు ఇంకెవరికైనా ఉందా. వాళ్లకి హైదరాబాద్‌లోనే ఒక్కోటి కోటి రూపాయల విలువ చేసే రెండు ఇళ్లున్నాయి తెల్సా" సరోజ ఉడుక్కుంది.

"అయితే నన్ను కూడా కోటి రూపాయల ఇల్లు కట్టమంటావా ఏంటి?" భయం నటిస్తూ అన్నాను.

"అక్కర్లేదు. వాళ్లముందు దరిద్రంగా ఉండకుండా కాస్త హుందాగా కనిపిస్తే చాలు" సరోజ కోపం చూసి, "బీదవాళ్లు హుందాగా ఉండరా" అని అడగాలనుకుని, "ఎందుకొచ్చిన డిస్కషన్" అనుకొని వూరుకున్నాను.

సండే వస్తే చాలు పిల్లలకు, నాకు ఇష్టమైనవి రెండు. మూడు స్పెషల్స్ చేసి పెట్టే సరోజ ఈ రోజు మాత్రం ముక్తసరిగా వంట ముగించి భోజనాలు వడ్డించింది. పిల్లలు మొహం ముడుచుకుంటే వాళ్లకు తను చేయాల్సిన పనుల లిస్ట్ చెప్పి బుజ్జగించింది. లండన్ మామయ్య గారి గొప్పతనం గురించి వాళ్లకు వర్ణించి చెప్తుంటే పెద్ద పెద్ద కళ్లు చేసుకుని విన్నారు. "మమ్మీ! కోటి రూపాయల బిల్డింగ్ అంటే సినిమాల్లో చూసే ధనవంతుల ఇళ్లలా ఉంటుందా?" నాలుగో తరగతి చదువుతున్న బాబిగాడు అడిగాడు.

"ఆc దాదాపు అలాగే ఉంటుంది. ఈసారి మనం తాతగారింటికి హైదరాబాద్ వెళ్లినప్పుడు వెళ్లి చూద్దాంలే" సరోజ అంది.

భోజనాలు కాగానే ఇల్లు సర్దే కార్యక్రమంలో పడింది. రాములమ్మ ఇల్లంతా దులుపుతోంది.

"నాకసలే డస్ట్ ఎలర్జీ. ఆదివారం కూడా ప్రశాంతంగా ఇంట్లో కూర్చోకుండా అయింది. సాయంత్రం వరకు ఎక్కడైనా తిరిగొస్తే మంచిది" అనుకుని, "సరోజా! ఈ డస్ట్‌లో నేను కూర్చోలేను. మ్యాట్నీ షో సినిమాకు వెళ్లొస్తా" అన్నాను. ఏ మూడ్‌లో ఉందో గాని "అలాగే, వెళ్లి రండి" అంది.

దగ్గర్లో వున్న ఒక థియేటర్‌లో టీనేజ్ లవ్‌స్టోరీ సినిమా ఆడుతుంటే టిక్కెట్టు తీసుకొని వెళ్లి కూర్చున్నాను. రొటీన్ స్టోరీ. నాకంతగా నచ్చలేదు. కానీ, నా పక్కన కూర్చున్న కాలేజీ స్టూడెంట్స్ బాగా ఎంజాయ్ చేశారు. తలనొప్పిగా వుంది. బలవంతంగా సినిమా పూర్తయ్యే వరకు కూర్చున్నాను. సాయంత్రం ఇంటికి చేరుకునేసరికి 'ఇది మా ఇల్లేనా' అనుకుని ఆశ్చర్యపోయాను. సరోజ మూడు గంటల్లో ఇల్లు స్వరూపాన్నే మార్చేసింది. ఉన్నంతలో ఇల్లంతా నీట్‌గా సర్దింది.

"వచ్చారా, ఎలా వుంది ఇల్లు? కాళ్లు నొప్పెడుతున్నాయి. క్షణం కూర్చోకుండా సర్దాను" నీరసంగా అంది సరోజ.

"చాలా బావుంది. మీ మామయ్య నెలకోసారైనా వస్తే బావుండు. ఇల్లంతా నీట్‌గా ఉండేది" నవ్వుతూ అన్నాను.

"అంటే, మామూలుగా నేను ఇల్లు నీట్‌గా ఉంచననేగా మీరనేది. నేనూ ఎంప్లాయినే కదా. మీతోపాటే ఉదయం వెళ్లి సాయంత్రం తిరిగొస్తాను. ఇంత శుభ్రంగా ఉంచడానికి టైమెక్కడ ఉంటుంది. అయినా మిమ్మల్నడగడం నాదే బుద్ధి తక్కువ" సరోజ ఉడుక్కుంటూ అంది.

"అబ్బ! సరోజా... ప్లీజ్! ఆపు... నాకు తలనొప్పిగా ఉంది. కాస్త కాఫీ తెచ్చివ్వు. వీలైతే ఒక టాబ్లెట్ కూడా ఇవ్వు" కుర్చీలో కూర్చుంటూ అన్నాను.

నా మొహం చూసి ఏమనుకుందోగాని, మాట్లాడకుండా లోపలికి వెళ్లి టాబ్లెట్, మంచినీళ్లు తెచ్చింది. మళ్లీ వెళ్లి కాఫీ తీసుకొచ్చింది.

రాత్రి భోజనాలైన తర్వాత పిల్లలు పడుకున్నారు. సరోజ నా దగ్గరకొచ్చి కూర్చుని, "ఏమండీ, మనింట్లో ఫర్నిచర్ బాగాలేదని, సోఫాసెట్ కొనాలని ఎప్పటినుండో అనుకుంటున్నాం కదా. అదేదో రేపే తెచ్చేసుకుంటే ఎలా వుంటుంది?" అని అడిగింది.

"బాగుంది. తలచుకున్నప్పుడే తాత పెళ్లంటే ఎలా? అయినా సోఫా సెట్టంటే మాటలా. కనీసం అయిదు వేలైనా కావాలి. ఇప్పుడెలా కుదురుతుంది?" ఆశ్చర్యంగా అడిగాను.

"అది కాదండీ, పాపకు చెయిన్ చేయించాలని దాచిపెట్టిన అయిదు వేలున్నాయి కదా. వాటితో కొందాం. పాపకు చెయిన్ మళ్లీ ఎప్పుడైనా చేయించుదాం. మామయ్య వస్తున్నాడు కదా, మరీ ప్లాస్టిక్ కుర్చీలు ఏం బావుంటాయి" సరోజ అసలు విషయం బయటపెట్టింది.

నాకు చాలా చికాగ్గా వుంది. "సరోజా! మీ మామయ్య వస్తున్నాడని అర్జంటుగా సోఫా సెట్ కావాలంటే ఎలా? అయినా, మనకు వీలైనప్పుడు మనం కొనాలి గాని, ఎవరి కోసమో, పాపకు కొనాలనుకున్న చెయిన్ డబ్బులు ఫర్నిచర్ కోసం ఖర్చుపెట్టడం నాకిష్టం లేదు. ఒక్క పూట కోసం వచ్చేవాళ్లకు ఇష్టమైనవి వండిపెట్టు. కావాలంటే చిన్న గిఫ్ట్ ఏదైనా కొనివ్వు. అంతేగాని, మన బడ్జెట్‌ను వాళ్ల కోసం మార్చుకోవలసిన అవసరం లేదు. నేను చెప్పాల్సింది చెప్పాను. తర్వాత నీ ఇష్టం" ఖచ్చితంగా చెప్పి లైటాఫ్ చేసి పడుకున్నాను.

మరునాడు లేచేసరికి సరోజ మొహం మాడ్చుకుని ఉంటుందనుకున్నాను. కాని, అలా ఏం లేదు. మామూలుగానే వుంది. సరోజ దగ్గర నాకు నచ్చే విషయం అదే. ఏదైనా ప్రాబ్లమ్ వివరించి చెప్తే అర్థం చేసుకుంటుంది. కాని, అనవసరంగా వాదించదు. సాయంత్రం ఇద్దరం స్కూలు నుండి ఇల్లు చేరుకోగానే సరోజ గిఫ్ట్ కొనాలని, అలాగే కొన్ని సరుకులు కొనాలని బయలుదేరతీసింది. నాలుగు గిఫ్ట్ సెంటర్లలో చూసిన తర్వాత, 'లేపాక్షి హాండీక్రాఫ్ట్స్' షాపులో ఒక సిల్వర్ కోటెడ్ రాధాకృష్ణుల బొమ్మను సెలక్ట్ చేసింది. నాలుగు వందల రూపాయలు పెట్టి ఇష్టం లేకపోయినా కొనక తప్పలేదు.

ఆ రోజు రాత్రి సరిగా పడుకుందో, లేదో తెలీదు గాని, ఉదయం నాలుగు గంటలకే లేచి పనులు మొదలుపెట్టింది సరోజ. తను స్కూల్‌కి లీవ్ పెట్టి నాతో కూడా లీవ్‌కి అప్లయ్ చేయించింది. హడావుడి పడుతూ చాలా రకాల వంటకాలు తయారుచేసింది. పిల్లలకు యూనిట్ టెస్ట్‌లు అవుతున్నాయి గనుక వాళ్లను మాత్రం స్కూలుకు పంపించింది.

సరిగ్గా పదకొండు గంటలకు లండన్ మామయ్య గారు ఎస్టీమ్ కారులో వేంచేశారు. వెంట ఆయన బిజినెస్ వ్యవహారాలు చూసే మేనేజర్, డ్రైవర్ వున్నారు. లోపలకు



అడుగుపెట్టగానే మా ఆవిడ భుజం మీద చేయివేసి, "ఏమ్మా... బావున్నావా, పిల్లలేరి?" అని ప్రశ్నించి జవాబు వినకుండానే "బాగున్నారా! ఈ రోజు స్కూల్‌కి వెళ్లలేదా ఏంటి?" అని ప్రశ్నించాడు.

"మీరొస్తారని నేనే వద్దన్నాను మామయ్యా" సరోజ కల్పించుకుంటూ అంది.

''అయ్యయ్యో! నేనొచ్చి మీ పనులన్నీ పాడుచేశానన్నమాట. సారీ... అయాం వెరీ సారీ!" నావైపు చూస్తూ అన్నాడు.

''ఫరవాలేదులెండి. ఒకరోజు లీవ్ పెడితే ఏంపోయింది. మీరెప్పుడోగాని రారు కదా" అన్నాను.

సరోజ ఫ్రిజ్‌లో నుండి కూల్‌డ్రింక్ తీసి సర్వ్ చేసింది. అరగంటసేపు అవీ, ఇవీ మాట్లాడిన తర్వాత సరోజ, నేను ఇద్దరం కలసి భోజనాలకు అరేంజ్ చేశాం. డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న తర్వాత, "అబ్బా! చాలా అయిటమ్స్ చేశావమ్మాయ్. చాలా శ్రమ తీసుకున్నావ్" అంటూ తినడం మొదలుపెట్టాడు.

లండన్ మామయ్య భోజనప్రియుడిలా ఉన్నాడు. "అబ్బ! గుత్తి వంకాయ కూర చాలా బావుంది. దోసావకాయ అదిరిందమ్మాయ్. ఇంక కంద బచ్చలి చెప్పక్కర్లేదు" అంటూ ఒక్కొక్క అయిటమ్‌ను పొగడుతూ మళ్లీ మళ్లీ వేయించుకొని తిన్నాడు. సరోజ ముఖం ఉడిపి హోటల్ పూరీలా ఉబ్బిపోయింది. కొసరి కొసరి వడ్డించింది. భోజనం కానిచ్చి, చివరన బాసుంది తిని, బ్రేవ్‌మని తేన్చి లేచాడు లండన్ మామయ్య. వక్కపొడి నములుతూ కాసేపు కబుర్లు చెప్పి, "ఇంక వెళ్లాలమ్మాయ్. చాలా పనుంది. చాలా రోజుల తర్వాత మంచి భోజనం తిన్నాను. మీ ఇద్దర్నీ చూస్తుంటే చాలా సంతోషంగా

వుంది" అని లేచి, "ఈసారి హైదరాబాద్ వచ్చినప్పుడు మా ఇంటికి తప్పక రావాల"ని చెప్పి బయలుదేరాడు.

"ఒక్క నిముషం ఉండండి మామయ్యా!" అంటూ సరోజ రాధాకృష్ణుల బొమ్మను ఆయన చేతిలో పెట్టి కాళ్లకు నమస్కారం చేసింది.

"ఎందుకమ్మా ఇవన్నీ" అంటూనే తీసుకుని, "వెరీ నైస్, బ్యూటిఫుల్, నాకు చాలా నచ్చింది" అంటూ తీసుకొని కారులో పెట్టాడు. పిల్లలకిమ్మని చాక్లెట్ల ప్యాకెట్ సరోజ చేతిలో పెట్టి కారులో కూర్చున్నాడు.

లండన్ మామయ్య వెళ్లిపోయిన తర్వాత సరోజ 'చీఫ్ మినిస్టర్ పర్యటన విజయవంతంగా ముగియగానే ఊపిరితీసుకున్న ప్రభుత్వ అధికారులలాగా' రిలాక్స్‌డ్‌గా ఫీలయింది.

ఆ తర్వాత రెండు నెలలకు దసరా సెలవులకు హైదరాబాద్‌లో వున్న మా మామగారింటికి వెళ్లాం. పండగ ముందు రోజు సరోజ "అమ్మా! మేము లండన్ మామయ్య వాళ్లింటికి వెళ్తొస్తాం. పిల్లలు వాళ్లిల్లు చూడాలంటున్నారు" అని వాళ్లమ్మతో అంది. వాళ్లమ్మ అదోలా మొహంపెట్టి, "ఇంటికి వెళ్తే ఆవిడ సరిగ్గా మాట్లాడదే. ఆయనకెంతసేపూ బిజినెస్ గొడవలే. పైగా ఆటోల కోసం బోలెడు డబ్బులు ఖర్చుపెట్టుకుని వెళ్లాలి" అని సరోజను చూసి ఏమనుకుందో, మళ్లీ "సరే, మీ ఇష్టం. వెళ్లి రండి" అంది. మామగారికి తలనొప్పిగా వుందని రాలేనన్నారు. అందుకని అడ్రస్ తీసుకుని మేమే బయలుదేరాం. చిక్కడపల్లిలో వున్న లండన్ మామయ్య గారింటికి వెళ్లడానికి ఆటో డ్రైవర్‌కు యాభై రూపాయలు ఇవ్వాల్సి వచ్చింది. ఇంటిముందు ఆటో దిగగానే ఇంటివైపు చూసి "సరోజ చెప్పినట్టుగానే వీళ్లిల్లు చాలా బావుంది" అనుకున్నాను. ఇంటి ముందున్న గూర్ఖాకు మేము 'సదరు' అని చెప్పుకొని లోపలికెళ్లాం. ఇంటిముందున్న రకరకాల పూలమొక్కలను, ఫౌంటెన్లను సరోజ, పిల్లలు సంతోషంగా చూస్తుండిపోయారు. మెయిన్ డోర్ ఓపెన్ చేసే వుంది. అయినా, డైరెక్ట్‌గా వెళ్లడం మర్యాద కాను గనుక కాలింగ్ బెల్ కొట్టాం. ఎవరో దాదాపు ముప్ఫై సంవత్సరాల ఆవిడ వచ్చి, మమ్మల్ని చూసి ఎవరు కావాలని అడిగింది. మేము 'ఫలానా' అని చెప్పగానే హాల్లోకి తీసుకెళ్లి కూర్చోమని, ప్రక్కనున్న రూంలోకి వెళ్లింది.

ముందు వరండా, తర్వాత పెద్ద హాలు, డూప్లెక్స్ మోడల్‌లో హాలు నుండి పైకి మెట్లు కనిపిస్తున్నాయి.

ప్రక్క రూంలో నుండి కర్టెన్ తొలగించుకొని లండన్ మామయ్య బయటికొచ్చారు. మమ్మల్ని చూడగానే ముందు ఆశ్చర్యపోయి, తర్వాత కొంచెం ఇబ్బందిగా ఫీలై "మీరా... కూర్చోండి, కూర్చోండి" అని సోఫాలో కూర్చుని మమ్మల్ని కూడా కూర్చోమన్నాడు.

"ఏమ్మా! ఎప్పుడొచ్చారు? కులాసానా..." అని పలకరించి ప్రక్కనే వున్న ఇంటర్‌కమ్ ఫోన్‌లో ఏదో నెంబర్ నొక్కి "సుజా! ఒక్కసారి క్రిందకు రా. గెస్ట్‌లొచ్చారు" అని ఫోన్ పెట్టేశాడు.

"ఈ రోజు చాలా బిజీగా ఉన్నానమ్మా. బిజినెస్ పార్ట్‌నర్స్ వచ్చారు. వాళ్లతో మాట్లాడుతున్నాను" అని, "మీరు అత్తయ్యతో మాట్లాడుతూ ఉండండి. నేను మళ్లీ వస్తాను" అన్నారు.

ఈలోగా హడావిడిగా క్రిందకు దిగిన ఆవిడ మమ్మల్ని చూడగానే విస్తుపోయి "మీరా" అని నెమ్మదిగా అని, "ఎప్పుడొచ్చారు?" ముక్తసరిగా పలకరించింది. లండన్ మామయ్య "సుజా! నువ్వు అమ్మాయి వాళ్లతో మాట్లాడుతూ ఉండు. నేను మళ్లీ వస్తాను" అన్నాడు.

"సరేగానీ, మనం సిక్స్‌ఓక్లాక్‌కి మిశ్రా గారింటికి పార్టీకి వెళ్లాలి గుర్తుందా?" అడిగింది.

ఆయన టైం చూసుకుని, "అబ్బో... నౌ ఇటీజ్ ఫైవ్ థర్టీ. టైం అయిపోతోంది కదా. పది నిముషాల్లో వాళ్లను పంపించి వస్తాలే" అంటూ వెళ్లిపోయాడు.

ఆవిడ మావైపు జాలిగా చూసి, "పాపం! మీరు రాకరాక వచ్చారు. మీతో కొంత టైం స్పెండ్ చేద్దామంటే ఒక పార్టీకి వెళ్లాల్సి వచ్చింది" అంది.

సరోజ మొహం పాలిపోయింది. నావైపు ఇబ్బందిగా చూసి ఆవిడతో, "ఫరవాలేదత్తయ్యా, అమ్మ మా కోసం చూస్తూ ఉంటుంది. మేం వెళ్లాలి" అంది.

"అయ్యో, అప్పుడేనా? పిల్లల్ని కూడా తీసుకొచ్చారు. వాళ్లకు ఇళ్లంతా చూపించి, కాఫీ తాగి వెళ్లండి" అని, "మల్లీశ్వరీ" అని ఇందాకటి ఆవిడను పిలిచి "వీళ్లకు ఇల్లు చూపించి, తర్వాత కాఫీ ఇవ్వు" అని, "మీరు ఇల్లు చూడండి. నేను మళ్లీ వస్తాను" అని పైకి వెళ్లిపోయింది.

వాళ్ల ప్రవర్తన చూసి నాకు చాలా చికాగ్గా ఉంది. 'ఎంత డబ్బుంటే మాత్రం మరీ ఇంత అహంకారమా?' అనుకున్నాను. మల్లీశ్వరి "రండమ్మా, ఇల్లు చూద్దురుగానీ" అంటూ తీసుకెళ్లింది. ఇంట్రెస్ట్ లేకపోయినా లేచి పది నిముషాల్లో ఇల్లంతా తిరిగి చూసి మళ్లీ హాల్లోకి వచ్చి కూర్చున్నాం. మల్లీశ్వరి కాఫీ తేవడానికి వెళ్లింది. ఈలోగా ఒకతను బహుశా వంటమనిషేమో బయటకొచ్చి "అమ్మా! రాత్రికి భోజనానికి ఉంటారా మీరు" అనడిగాడు.

సరోజ అతనివైపు విచిత్రంగా చూసి "లేదు, మేం వెళ్లిపోతున్నాం" అంది.

"అబ్బే, ఏం లేదమ్మా. మామూలుగా అమ్మగారు వాళ్లు రాత్రిపూట పచ్చికూరముక్కల సలాడ్, ఒక గ్లాసు పాలు తాగుతారు. ఎవరైనా గెస్ట్‌లు వచ్చినప్పుడు మాత్రమే వంట చేయడం" అన్నాడు.

"ప్రొద్దున పూటైనా అన్నం తింటారా? తినరా?" వ్యంగ్యంగా అడిగింది సరోజ.

అతడు "తింటారమ్మా... కానీ అయ్యగారి తిండి విషయంలో అమ్మగారు చాలా స్ట్రిక్ట్‌గా ఉంటారండి. నూనె పదార్థాలు, దుంపకూరలు ఏవీ తిననీయరు. అయ్యగారు మంచి భోజనప్రియులండీ. అమ్మగారెప్పుడైనా వూరెళితే అయ్యగారు శుభ్రంగా అన్నీ చేయించుకొని తింటారండి" గొంతు తగ్గించి నవ్వుతూ అన్నాడు.

ఈలోగా లండన్ మామయ్య, ఆయన భార్య ఇద్దరూ పార్టీ కోసం రడీ అయి క్రిందికి వచ్చారు.

"సారీ అమ్మాయ్... మేమొక పార్టీకి వెళ్లాల్సి వుంది. పోనీ ఈ పూటకు మీరుండండి. వంటవాడు, పనివాళ్లు అందరూ ఉన్నారు. మీకేం ఇబ్బంది ఉండదు" అన్నాడు.

ఆవిడ ఆయనవైపు చికాగ్గా చూసి, "బాగుంది, అమ్మాయి వాళ్ల అమ్మగారింటికొస్తే మనం ఉండమంటే ఏం బావుంటుంది?" అంది.

సరోజ "లేదు మామయ్యా, మేం వెళ్లిపోతాం" అనగానే, నేను "వెళ్తొస్తామండీ" అని చెప్పి పిల్లల్ని తీసుకుని బయటికొచ్చాం. "ఫోన్ చేయకుండా డైరెక్టుగా రావడం మనదే తప్పు" నేను విసుగ్గా అన్నాను. సరోజ మాట్లాడలేదు. బాగా అప్‌సెట్ అయినట్టుంది.

ఇంటికి వెళ్లగానే పిల్లలు ఆకలేస్తుందని మొదలుపెట్టారు. మా అత్తగారు వాళ్లకేవో చిరుతిండ్లు తినడానికిచ్చి, "అదేంటే, తొందరగానే వచ్చేశారు" అంది అనుమానంగా.

"వాళ్లేదో పార్టీ వెళ్తున్నారమ్మా, వాళ్లని ఇబ్బంది పెట్టడమెందుకని వచ్చేశాం."

"నాకు తెలుసు. ఆవిడ సరిగా మాట్లాడి వుండదు. ఆయనకెంతసేపూ బిజినెస్ లోకమే. అందుకే వెళ్లొద్దంటే విన్నావు కాదు" అత్తగారు బాధగా అన్నారు.

"పోయినసారి మామయ్య మా యింటికొచ్చినప్పుడు ఈసారి తప్పకుండా వాళ్లింటికి రావాలన్నాడమ్మా. అందుకే వెళ్లాం" అంది సరోజ.

"మీ ఇంటికీ వచ్చాడా? ఆయన ఏదైనా ఊరికి వెళ్తే భోజనానికెళ్లడానికి ఆ ఊర్లో బంధువులెవరు దొరుకుతారా అని చూస్తాడమ్మా. హోటల్ తిండి ఇష్టం వుండదు. పైగా ఇంట్లో తిండి సుఖం లేదు. పెళ్లాం అన్నింటికి కట్టడి చేస్తుందట" అత్తగారు అన్నారు.

అప్పటికిగాని లండన్ మామయ్య గారి సైకాలజీ నాకర్థం కాలేదు. సరోజ కూడా వాళ్లమ్మ చెప్తున్నది బిత్తరపోయి వింటున్నది. "పిచ్చిది! ఆయనింకా తనమీద ప్రేమతో ఇంటికొచ్చాడనుకుని తెగ హడావిడి చేసేసింది. అసలు విషయం ఇప్పటికి అర్థమై వుంటుంది" అనుకున్నాను.

పండగ కాగానే వైజాగ్ వెళ్లిపోయి రొటీన్ లైఫ్‌లో పడిపోయాం. దాదాపు నెల రోజుల తర్వాత ఉదయమే ఫోనొచ్చింది. నేనే రిసీవ్ చేసుకున్నాను. లండన్ మామయ్య ఫోన్లో "బావున్నారా" అని అడిగి, "సరోజను పిలుస్తానుండండి" అని "సరోజా! నీకు ఫోన్" అని పిలిచాను. సరోజ చేతులు తుడుచుకుంటూ వస్తూ "ఎవరు?" అని అడిగింది. "మీ లండన్ మామయ్యగారు" నేను నవ్వుతూ అనగానే సరోజ ముఖంలో రంగులు మారాయి. ఫోన్ ఎత్తి "హలో మామయ్యా... బావున్నారా" ముక్తసరిగా అడిగింది. అవతల వైపు ఆయనేం చెప్తున్నాడో తెలీదు గాని, ఒక్క నిముషమాగి సరోజ "అలాగా... సారీ మామయ్యా! మేము రేపు ఇంట్లో ఉండట్లేదు. పిల్లలు అరకు వెళ్దామని అడుగుతున్నారు. అందుకని రేపు వెళ్దామని ప్లాన్ చేసుకున్నాం. వేరే ఫ్రెండ్స్ కూడా వస్తున్నారు" అంది. ఆయనేమన్నారో గాని సరోజ మళ్లీ 'సారీ' చెప్పి ఫోన్ పెట్టేసింది.

"అదేంటి, అలా అబద్ధమాడేశావు?" ఆశ్చర్యంగా అన్నాను నేను. "లేకపోతే రేపు వైజాగొస్తున్నానమ్మా, మీ ఇంటికొస్తాలే' అంటున్నాడు అదేదో మననుద్ధరించడానికన్నట్టు. మళ్లీ అంత హడావుడి నేను పడలేను. మీరు రేపు లీవ్ పెట్టండి. నేను కూడా లీవ్‌కి అప్లయ్ చేస్తాను. పిల్లలను తీసుకుని నిజంగానే అరకు వెళ్దాం సరదాగా" అంది.

టిఫిన్ తింటున్న పిల్లలు ఎగిరి గంతేసినంత పనిచేసి, "థాంక్యూ మమ్మీ!" అన్నారు. వాళ్ల సంతోషం చూసి నేను "మొత్తానికి లండన్ మామయ్య పుణ్యమా అని అనుకోకుండా అరకు వెళ్తున్నామన్నమాట" అనుకొని నవ్వుకున్నాను.

●